విజయదశమినాడు సంధ్యవేళ విజయవాడలోని ఇంద్రకీలాద్రి పర్వతంమీద వెలసిన కనకదుర్గగుడి రంగురంగుల విద్యుద్దీప మాలికలతో ధగద్ధగాయమానంగా వెలిగిపోతోంది.

నాలుగు పదులు నిండి డబ్బు, చదువు, హోదా అన్నీ వుండి సంస్కారం లోపించిన కనకారావు అలవాటు ప్రకారం గుడి ప్రాంగణానికి కాస్త ముందుగానే చేరుకొని, కారును ఇంటికి పంపించేశాడు.

దుర్గాదేవి తొమ్మిది అవతారాలను స్తుతించేవారు, ప్రతి మెట్టును పసుపు కుంకుమలతో అర్చిస్తూ ఎక్కేవారు, వివిధ తాపశమనానికి మొక్కుకునేవారు... ఆదిగాగల భక్తులతో ఆలయ ప్రాంగణం నిండిపోయింది.

వచ్చేవారు వస్తుంటే అమ్మవారిని అర్చించి




కెప్టెన్ షేక్ మౌలాలీ

వెళ్ళేవారు వెళుతున్నారు. కొందరు ప్రక్కనగల ఆంజనేయస్వామిని, గణపతి, కుమారస్వామి, నవదుర్గలు, మల్లికార్జునుని సేవించి రెండోవైపు మెట్లు దిగుతున్నారు. కాని రద్దీ తగ్గలేదు. దేవస్థానం ఉద్యోగులు, పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. అయినా జనంతో కోవెల పరిసరమంతా కిటకిటలాడుతున్నది.

ఆరోజు అమ్మవారి విశేష అలంకరణ భక్తుల్ని మరింతగా ఆకర్షించింది. కనుక క్యూ ముందుకు నడవటం లేదు.

కొబ్బరికాయ, పండ్లు, పూలతోనిండిన బుట్టను చేతుల్లో పెట్టుకొని తగిన సమయం కోసం వేచియున్న కనకారావు మెల్లగా క్యూలో పదహారు, పదిహేడు సంవత్సరాల నవనవలాడే అమ్మాయిల మధ్య చోటు సంపాయించగలిగాడు.

ఇంకిపోయిన నదికి ఒక్కసారిగా వరద వచ్చి పొంగినట్లు, శరీరమంతా విద్యుత్తు ప్రవహించినట్లు ఆనంద పరవశుడవుతున్నాడు.

తన్నెవరో ముందుకు తోసినట్లు కొన్నిసార్లు, వెనక్కు నెట్టినట్లు మరికొన్నిసార్లు నటించి వారి ఉన్నత అవయవాలు తన శరీరానికి తగిలేట్లు చూసుకుంటున్నాడు.

బిత్తరపోయిన ఆ అమ్మాయిలు కనకారావు ముఖంలోకి చూశారు. 'భక్తి తన్మయత్వంలో తూగుతున్నాడా!' అనిపించింది చేతులు జోడించి, కనురెప్పలు మూసుకున్న అతని అభినయ ముద్ర. అతనికి తెలియనట్లుగానే మోచేతులతో వెనుక నున్నవారి అవయవ పొందికను మెల్ల మెల్లగ తాకుతున్నాడు.

ఆ అమాయక కన్యకామణులు కొంతకాలం సహించారు. కాని కనకారావు అభినయం మరికొంత ఎక్కువయింది. వారు విసుక్కున్నారు. అయినా లాభంలేకపోయింది.

గుడి చివరి మలుపు వచ్చింది. రద్దీ మరికొంత ఎక్కువయి తొక్కిసలాట మొదలయింది. సన్నగా చినుకులు కూడా పడసాగాయి. కనకారావు నాలుగు గోవుల మధ్య ఆబోతులాగా ఫీలవుతున్నాడు. శరీరమంతా మత్తెక్కింది. 'ప్రతిరోజూ విజయదశమి అయితే ఎంత బావుణ్ను!' అనుకున్నాడు.

అమ్మవారి సన్నిధి వచ్చింది. కాని కనకారావు మరో ప్రపంచంలో వున్నాడు. దానిని భక్తి తత్పరతగా భావించిన అర్చకులు పూజా సామగ్రి అందుకొని, బుట్టలో కాస్త ప్రసాదం పడేసి కనకారావును ముందుకు నెట్టారు.

కొండ దిగిన కనకారావు తన జన్మ సార్థకమయినంతగా సంతోషించాడు. ఇదివరకు చాలాసార్లు ఇలాంటి అనుభవం కలిగింది. కాని ఈరోజు సంఘటన ముందు అవన్నీ బలాదూర్ అనుకున్నాడు.

ఆటోలో ఇంటి ముందు దిగిన కనకారావు డబ్బులిద్దామని జేబులో చెయ్యి పెట్టాడు. పర్సు లేదు.

షాక్‌నుండి తేరుకోకముందే లోపలనుండి వచ్చిన భార్య బుట్ట అందుకొని "ఏమిటండీ అలా వున్నారు! అరే చేతికున్న మన పెళ్ళినాటి వజ్రపుటుంగరం ఏమయింది? అయ్యో! అది ప్లాటినంది కదండీ!" కంగారుగా అంది.

కనకారావుకు నోరు పెగల్లేద. కళ్ళు చీకట్లు కమ్మాయి. వరద ఎక్కువయి కూలిన వంతెనలా మెట్ల మీదే కూలబడ్డాడు.

నాలుగు రోజుల తర్వాత కనకారావుకు నాట్-పెయిడ్ కవరు వచ్చింది. చించి చదివాడు-

"లోకం నువ్వనుకున్నంత తెలివితక్కువది కాదు. మా ఉమ్ములో బాగా పడ్డావు. మా నలుగురికి తలా పాతికవేలు ముట్టాయి! థ్యాంక్స్!!"

■

## కాలమ్ దాటని కథ

### హాబీ

ఆ ఆడపిల్లలిద్దరూ సిస్టర్స్. వారికి 'ముగ్గులు' వేసే అలవాటు వున్నది. అందుకే ఎప్పుడూ ఒకచేత్తో ముగ్గుల డబ్బా, ఒక చేత్తో-తాము రకరకాలుగా వేసిన ముగ్గుల ఆల్బం వుంటుంది. వారి హాబీ వారి వీథి వరకే కాదు, మిగతా వీథులకు లేదా ఇండియాలోని వీథులన్నిటికీ ఎగబ్రాకాలనీ వున్నది. దానికై వారు ఎన్నెన్నో ప్రయోగాలు చేశారు, చేస్తున్నారు.

వాటిల్లో ముఖ్యంగా...

ఎక్కడ ముగ్గుల పోటీలు వున్నా పాల్గొంటారు. ఒకటో అరో బహుమతులూ పొందారు.

రెండు: ఇప్పుడు వచ్చే రకరకాల వార పత్రికలూ, పక్ష పత్రికలూ, మంత్లీలూ అన్నిటికీ ముగ్గులు వేసి పంపేవారు. కొన్ని పడేవి. కొన్ని తిరిగి వచ్చేవి.

మూడు: డైరక్టుగా ఆయా పత్రికాధిపతుల ఆఫీసుల కెళ్ళి వారికి తమ ఆల్బంచూపి, వీలైతే వారిముందే ముగ్గువేసి చూపించేవారు.

ఆ పత్రికాధిపతులు ముందు ఆనందించి చివరికి వీరంటే రోదించే పరిస్థితికి వచ్చారు. ముగ్గుల శీర్షికలు పత్రికల్లోంచి తీసివేశారు.

అయినా వారు పట్టువదలని ఆడ విక్రమాదిత్యులు.

ఊర్లో ఆడవారనే వారందరి దగ్గరకూ పోయి తమ ముగ్గులు ఏయే పత్రికల్లో వచ్చాయో, ఆ ఎడిటర్ తమకు ఎంత ముఖ్యుడో, అతనితో తమకెంత 'దగ్గరి' సంబంధముందో ఏకరువు పెట్టి వారికి ముగ్గుల గురించి వివరించి వాళ్ళ ఇంటి ముంగిట ముగ్గులు వేసి అర్థరాత్రి దాకా 'ముగ్గుల భజన' చేసేవారు. మొదట్లో సరదా పడిన ఆడజనం తమ మొగుళ్ళు చేసే 'రభస' తట్టుకోలేక ముగ్గుల సిస్టర్స్ వస్తే చాలు-గుమ్మాలు మూసుకునే పరిస్థితికి వచ్చారు, ముగ్గులు కొంపల ముందు లేకపోయినా పర్వాలేదనుకొని.

సిస్టర్స్ ఎక్కడికి పోయినా తమ విద్యకు ఎదురొస్తోందని బాధపడి ఏం చేయాలో తోచక ఒక వినూత్నమైన ముగ్గువేసి ప్రపంచ పటంలోకి ఎక్కాలనుకొన్నారు. దాని పర్యవసానమే వంద కిలోల ముగ్గు పిండితో రథం ముగ్గువేసి, ప్రజల ముక్కులకు వారి స్వంత వ్రేళ్ళు వేయించాలనుకొన్నారు.

ఒకనాటి రాత్రి వంద కిలోలతో ముగ్గు మొదలు పెట్టారు. వేస్తున్నారు వేస్తున్నారు...రథం త్రాడు దగ్గరకు వచ్చారు. ఇంకా యనభై కిలోల ముగ్గు వున్నది. ఆ ముగ్గు త్రాడుగా వేస్తూ వెళ్తున్నారు...వెళ్తున్నారు... ఎటువైపుకి వెళ్ళారో తెలియదు. ఎంత దూరం పోయారో తెలియదు.

పాపం! ఆ సిస్టర్స్ తల్లిదండ్రులు ఈ రోజుకీ తమ పిల్లల కోసం వెతుక్కొంటున్నారు.

– ప్రసాద్‌వర్మ